సాక్షి పెద్దపల్లి

గురువారం । 18 । జూలై । 2024

ఓసీపీలో అసువులుబాశారు..

తొలిఏకాదశి పండగ పూట విషాదం నెలకొంది. ఇద్దరు సింగరేణి కార్మికుల ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయి. డ్యూటీకి వెళ్లి వస్తామని చెప్పి ఇంట్లోంచి వెళ్లి ఓసీపీలో అసువులుబాశారు. సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–2 ప్రాజెక్టులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు(58), మజ్దూర్ గాదె విద్యాసాగర్(50) మృతిచెందగా.. సమ్మయ్య, శ్రీనివాసరాజు గాయపడ్డారు. - వివరాలు 8లో▸



గోదావరిఖని ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం



రామగుండం జ్యోతినగర్ ఐదో డివిజన్‌లో పీర్లకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

జ్యోతినగర్: త్యాగానికి ప్రతీకగా పిలిచే మొహర్రం వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్యాపూర్‌లో పీర్ల ఉత్సవాలు నిర్వహించుకున్నారు. డప్పు చప్పుళ్లతో పీర్లను వీధులగుండా ఊరేగించారు. భక్తులు ఊదు బెల్లం, దట్టీలు, పూలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పీర్ మహమ్మద్, రహీం, మానాల శ్రీనివాస్, ఆకుల రమేశ్, చిరంజీవి, అబ్దుల్లా, ఆంజనేయులు, గుండు సతీశ్, అష్రఫ్, అంజి, గణేశ్, భక్తులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్ పట్టణంలో వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం





మంథనిలో పరమేశ్వరుడికి, పెద్దపల్లిలో వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి

పెద్దపల్లిరూరల్/మంథని: తొలిఏకాదశి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంథనిలో గోదావరినదిలో పుణ్యస్నానాలు చేశారు. పెద్దపల్లిలోని అమర్‌నగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. స్టేషన్‌రోడ్డు, ఎల్లమ్మచెరువుకట్ట, రంగంపల్లిలోని ఆంజనేయస్వామి, శివాలయాల్లో పూజలు చేశారు. మంథని గోదావరినదిలో పుణ్యస్నానాలు చేసి నదీతీరంలోని సంగమేశ్వరస్వామితో పాటు గౌతమేశ్వరుడు, సురాబాండేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



మంథని గోదావరినదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను సందర్శించిన సింగరేణి డైరెక్టర్



ఆర్‌ఎఫ్‌సీఎల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వర్ రెడ్డి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారాన్ని బుధవారం సింగరేణి ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సందర్శించారు.ఆర్‌ఎఫ్‌సీఎల్ జీఎం ఓఅండ్ఎం ఉదయ్ రాజహంస ప్లాంట్ గురించి వివరించారు. మెయిన్ కంట్రోల్ యూనిట్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ మ్యాప్, యూరియా ఉత్పత్తి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీ–1 సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ చందా శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు కొలనూర్‌లో మంత్రుల పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



కొలనూర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఓదెల: ఓదెల మండలం కొలనూర్ గ్రామంలో ఈ నెల 19న రాష్ట్రమంత్రులు పర్యటించనున్నారు. గ్రామంలో రూ1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం, రోడ్డు పనులను మంత్రులు ఉత్తమకుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో స్థానికంగా ఉన్న రైతువేదిక వద్ద హెలీప్యాడ్‌ను సిద్ధం చేస్తున్నారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు జి.అశోక్‌రెడ్డి, ఓంకార్ యాదవ్, ఇతర అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు.

31లోపు దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా 10నెలల పాటు యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచితకోచింగ్ శిక్షణకు ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ వెల్ఫేర్ అభివృద్ధి అధికారి నాగలేశ్వర్ తెలిపారు. అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

జిల్లాలో 24.8 మిల్లీమీటర్ల వర్షపాతం

పెద్దపల్లిరూరల్: జిల్లావ్యాప్తంగా బుధవారం కురిసిన వర్షపాతం వివరాలను జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి రవీందర్ వివరించారు. జిల్లాలో సాధారణ వర్షపాతం 5.5మిల్లీమీటర్లు కురవాల్సిఉండగా 24.8మిల్లీమీటర్లు కురిసిందని వివరించారు. కమాన్‌పూర్‌లో అత్యధికంగా 70.8మిల్లీమీటర్లు కురవగా, అత్యల్పంగా ఓదెలలో 3.9మిల్లీమీటర్ల వర్షం కురిసిందని పేర్కొన్నారు. ధర్మారం మండలంలో 12.7, పాలకుర్తిలో 42.8, అంతర్గాంలో 19.6, రామగుండంలో 37.4, రామగిరిలో 27.3, పెద్దపల్లిలో 12.2, జూలపల్లిలో 19.6, శ్రీరాంపూర్‌లో 9.8, ముత్తారంలో 16.8, మంథనిలో 64.0, ఎలిగేడు, సుల్తానాబాద్‌లో 5.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని ఈ సందర్భంగా రవీందర్ వివరించారు.

ఓసీపీలపై సింగరేణి నజర్

- వర్షాకాలం బొగ్గు ఉత్పత్తిపై డైరెక్టర్ల దృష్టి
- వర్షం కురిసి.. తగ్గిన వెంటనే ఉత్పత్తికి ఏర్పాట్లు
- ఏరియాల వారీగా పర్యటిస్తున్న ఉన్నతాధికారులు



ఓసీపీ-3 క్వారీలోకి వస్తున్న వర్షపు నీరు

గోదావరిఖని: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఓసీపీలపై సింగరేణి యాజమాన్యం దృష్టి సారించింది. సంస్థలో ఓసీపీల ద్వారా 70శాతం బొగ్గు ఉత్పత్తి చేస్తున్న క్రమంలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. రామగుండం రీజియన్‌లో రెండురోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో సంస్థ ప్రాజెక్టుఅండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం రీజియన్‌లో పర్యటించి, ఉత్పత్తిపై దిశానిర్దేశం చేశారు.

ఉత్పత్తికి అంతరాయం లేకుండా..

సంస్థవ్యాప్తంగా విస్తరించిన 18ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం లేకుండా యాజమాన్యం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. భారీ వర్షాలు కురిసినా ఒక షిఫ్టుకన్నా ఎక్కువ ఉత్పత్తి నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచిస్తున్నారు. భారీ యంత్రాలు నడిచే హాలేజీ రోడ్లు, బొగ్గు వెలికితీసే కోల్‌బెంచ్ క్వారీ, మట్టిని వెలికితీసే ఓబీ క్వారీల్లో నీటి నిల్వలు పేరుకపోకుండా చూడాలని ఆదేశిస్తున్నారు. ఈ మేరకు అన్ని ఏరియాల్లో సింగరేణి డైరెక్టర్లు పర్యటించి ఓసీపీల్లో ఉత్పత్తిపై సూచనలు చేస్తున్నారు. భారీవర్షాలతో నీరు క్వారీలోకి చేరి హాలేజీ రోడ్లు బురదమయంగా మారడం, క్వారీల్లో నీటిమట్టం పెరిగి అందులో ఉన్న యంత్రాలు మునిగిపోవడం లాంటి సంఘటనలు గతంలో జరిగాయి. అవి పునరావృతం కాకుండా ఓసీపీలను పర్యవేక్షిస్తున్నారు.

హాలేజీ రోడ్లపై ప్రత్యేక దృష్టి

నిత్యం భారీ యంత్రాలు నడిచే క్వారీ హాలేజీ(ప్రధాన) రోడ్లపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. భారీ వర్షాలు కురిసినా రోడ్లపై నీరు నిలవకుండా సైడ్‌డ్రైన్లు పూర్తి చేశారు. రోడ్లపై బురద లేకుండా ఎప్పటికప్పుడు గ్రేడింగ్ చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షం కురిసి తగ్గిన వెంటనే రోడ్లపై భారీ వాహనాలు తిరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

యంత్రాలు మునిగిపోకుండా చర్యలు

భారీ వర్షాలతో ఓసీపీ క్వారీల్లోకి వరదనీరు చేరుతోంది. గతంలో క్వారీల్లో నీటినిల్వలు పెరిగి యంత్రాలు మునిగిపోయాయి. ఈ క్రమంలో ఓసీపీల్లో నీటినిల్వలు పెరగకుండా హైకెపాసిటీ పంపులు ఏర్పాటు చేశారు. క్వారీల్లో చేరిన నీటిని ఎప్పటికప్పుడు పంపింగ్ చేసేలా 350హెచ్‌పీ మోటార్లను వినియోగిస్తున్నారు. సబ్‌మెర్సిబుల్ పంపుల ద్వారా నీటిని తోడేలా చూస్తున్నారు. క్వారీలోని సంపుల్లో నీటిని తోడేందుకు వినియోగిస్తున్న మోటార్లు మునిగిపోకుండా ఫ్లోటింగ్ ప్లాట్‌ఫాంలు నిర్మిస్తున్నారు. నీటినిల్వలు పెరిగినా ఫ్లోటింగ్ ప్లాట్‌ఫాంపై మోటార్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నీటిని తోడేలా ప్రణాళికలు రూపొందించారు. పక్కనే ఉన్న వాగులు, కాల్వల నుంచి భారీ నీటిప్రవాహం ఓసీపీ క్వారీలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

రీజియన్‌లో పర్యటించిన డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వర్షాకాలంలో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి యథావిధిగా సాగేలా యాజమాన్యం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో రామగుండం రీజియన్‌లో సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. ఓసీపీ–1, 2, 3, జీడీకే–5 ఓసీపీలను సందర్శించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి తీసేలా వ్యూహాత్మకంగా ముందుకుసాగాలని అధికారులకు సూచించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ– 1,3 జీఎంలు చింతల శ్రీనివాస్, సుధాకర్‌రావు తదితరులున్నారు.



వ్యూపాయింట్ ద్వారా ఓసీపీ-5 క్వారీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎంలు చింతల శ్రీనివాస్, సుధాకర్‌రావు

నగరంలో సమస్యలుంటే చెప్పండి..

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌తో 'సాక్షి' ఆధ్వర్యంలో ఈనెల 19న(శుక్రవారం) ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. డెంగీ, పారిశుధ్యం, తాగునీరు, ఖాళీ స్థలాలు, రహదారులు తదితర సమస్యలుంటే రామగుండం నగరపాలక పరిధిలోని ప్రజలు తెలియజేయవచ్చు. వీటి పరిష్కారానికి కమిషనర్ సమాధానమిస్తారు.



తేదీ: ఈనెల 19న(శుక్రవారం)

సమయం: ఉదయం 10:30 గంటల నుంచి 11వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్: 98499 05878

సాక్షి ఫోన్ ఇన్

ఇదేం పారిశుధ్య నిర్వహణ?

- కాంట్రాక్టర్‌కు మెమో ఇవ్వండి
- పనిచేయని వారిని విధుల్లోంచి తొలగించండి
- జిల్లా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీలో సూపరింటెండెంట్‌కు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం

పెద్దపల్లిరూరల్: 'ఇదేం పారిశుధ్య నిర్వహణ.. పనిచేయని వారిని తొలగించండి.. సంబంధిత కాంట్రాక్టరుకు మెమో ఇవ్వండంటూ' కలెక్టర్ కోయ శ్రీహర్ష అసహనం వ్యక్తం చేశారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో అపరిశుభ్రతను గమనించి పారిశుధ్య సిబ్బంది సక్రమంగా విధులకు రావడం లేదా అని ప్రశ్నించారు. ఆసుపత్రిలో శానిటేషన్ పనులు పొందిన కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేయాలని సూపరింటెండెంట్ రమాకాంత్‌ను ఆదేశించారు. ఇటీవల సెప్టిక్‌ట్యాంకులో బాలుడుపడి మరణించిన ప్రదేశాన్ని పరిశీలించి అందుకు గల కారణాలపై ఆరా తీశారు. ఆస్పత్రి ఆవరణలో టాయిలెట్లు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బ్లడ్‌బ్యాంకు, ఫార్మసీ, దంత, కంటివైద్యం, జనరల్‌వార్డును పరిశీలించారు. తాత్కాలిక పద్ధతిన సిబ్బందిని నియమించుకుని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో అత్యవసరమైన పనులు ఉంటే సంబంధిత ఇంజినీర్లతో ప్రతిపాదనలు రూపొందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో ఇద్దరు దంతవైద్యులు ఉండడంతో సేవలు మెరుగ్గా అందాలని సూచించారు. ఇన్‌పేషెంట్లకు అందించే డైట్ వివరాలను పరిశీలించి నాణ్యమైన భోజనం అందేలా చూడాలని సూచించారు.



జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకును తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

నేడు రుణమాఫీ సంబరాలు

- రైతు వేదికల వద్దకు తరలిరండి
- మండలానికో రైతువేదిక ఎంపిక
- జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం రూ.లక్షలోపు రైతు రుణమాఫీని చేస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల సమక్షంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి తెలిపారు. జిల్లాలోని 14మండలాల్లో మండలానికి ఒకటి చొప్పున ఎంపిక చేసిన రైతువేదికల వద్ద నిర్వహించే కార్యక్రమానికి రైతులు హాజరు కావాలని కోరారు.

ఎంపిక చేసిన రైతువేదికలివే

రెతు రుణమాఫీ సంబరాలకు జిల్లా వ్యవసాయ శాఖ ఎంపిక చేసిన రైతువేదికల వివరాలను డీఏవో ఆదిరెడ్డి వివరించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి, ఎలిగేడు, జూలపల్లి మండలం తేలుకుంట, రామగుండం మండలం మేడిపల్లి, పాలకుర్తి మండలం ఎల్కలపల్లి, అంతర్గాం, ధర్మారం మండలం బొట్లవనపర్తి, కమాన్‌పూర్ మండలం గుండారం, మంథని మండలం గుంజపడుగు, రామగిరి మండలం కల్వచర్ల, ముత్తారం, ఓదెల, శ్రీరాంపూర్ మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

29,275మందికి రుణమాఫీ

జిల్లాలోని 14మండలాలకు చెందిన 29,275మంది రైతులకు రుణమాఫీ చేస్తున్నట్లు డీఏవో ఆదిరెడ్డి తెలిపారు. పెద్దపల్లిలో 1,071, అంతర్గాం 1,077, ధర్మారం 3,839, ఎలిగేడు 1,421, జూలపల్లి 2,337, కమాన్‌పూర్ 1,170, మంథని 2,863, ముత్తారం 1,616, ఓదెల 2,742, పాలకుర్తి 1, 260, రామగిరి 1,071, రామగుండం 213, కాల్వశ్రీరాంపూర్ 2,789, సుల్తానాబాద్ మండలంలో 3,547 మందికి రుణమాఫీ కానుందని పేర్కొన్నారు.

'కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి'

సుల్తానాబాద్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ కోరారు. బుధవారం మండలకేంద్రంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో స్థానిక సంస్థల్లో బీసీలకు 23శాతం రిజర్వేషన్లను 42శాతం పెంచుతామని హామీ ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన హామీని అసెంబ్లీ తీర్మాణం చేసి జీవో నంబర్ 26 విడుదలచేశారని అన్నారు. వెంటనే బీసీ కుల గణన చేపట్టి, 42శాతం రిజర్వేషన్లు పెంచకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు ప్రత్యేక సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి యేటా రూ.20,000కోట్ల బడ్జెట్ కేటాయించాలని అన్నారు. బీసీ సామాజికవర్గానికి కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కో–ఆర్డినేటర్ దశరథం, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, పాండు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మాదిగలకు స్థానమేది?



పెద్దపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు సురేందర్ సన్నీ, రవి, కిరణ్‌బాబు, అంజయ్య, సతీశ్, తదితరులు

పెద్దపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలకు మంత్రిపదవులను ఇచ్చి సముచిత గౌరవాన్నిస్తుంటే తెలంగాణలో మాదిగలను ఇక్కడి పాలకులు విస్మరిస్తున్నారని మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ ఆరోపించారు. పెద్దపల్లిలోని కమాన్ వద్ద బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయాల్లో మాదిగలకు అన్యాయం చేస్తున్నారన్నారు. మాదిగలు కోల్పోతున్న రాజకీయ వాటాను సాధించేందుకే మాదిగశక్తి ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఈనెల21న పెద్దపల్లిలో మాదిగ శక్తి సదస్సును నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సదస్సుకు మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ప్రొఫెసర్ కాశీం, హైకోర్టు న్యాయవాది శరత్‌కుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్య క్రమంలో నాయకులు రవి, కిరణ్‌బాబు, అంజయ్య, సతీశ్, రాజేందర్, భూమయ్య, అంజయ్య, రమేశ్, సదయ్య, తిరుమల్, అవినాష్, గట్టు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. ఎప్పుడు కూలుతుందో?



చందపల్లి వద్ద ఎస్సారెస్పీ డీ-83 ప్రధాన కాలువపై విరిగిపోయిన వంతెన రెయిలింగ్





పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన చందపల్లి వంతెన కిందిభాగం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు చందపల్లి వద్ద శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన డీ–83 కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఏ క్షణాన కూలుతుందోనన్న భయాందోళన నెలకొంది. 50ఏళ్ల కాలం క్రితం నిర్మించిన వంతెన రెయిలింగ్ విరిగిపోయింది. పైభాగంలో గుంతలు పడి నీరు నిలుస్తోంది. కింది భాగం పెచ్చులూడుతోంది. ఇనుప చువ్వలు బయటకు తేలి వంతెన ప్రమాదకరంగా మారింది. పెద్దపల్లి నుంచి చందపల్లి మీదుగా తుర్కలమద్దికుంట కాచాపూర్ చొప్పదండి దాకా ఈ మార్గం ద్వారా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, భారీవాహనాలు సైతం వెళ్తుంటాయి. పెద్దపల్లి నుంచి తుర్కలమద్దికుంట రూ.2కోట్ల వ్యయ అంచనాలతో రహదారిని డబుల్‌రోడ్డుగా నిర్మించిన అధికారులు, పాలకులు ఈ మార్గ మధ్యలో ఉన్న వంతెనను పునర్నిర్మిస్తే బాగుండేదని ఈ ప్రాంత వాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


రాజ్‌కుమార్(ఫైల్)

ధర్మారం: ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన కారపూరి రాజ్‌కుమార్(20) మద్యానికి బానిసై బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కారపూరి మొగిలి కొడుకు రాజ్‌కుమార్ మద్యం, సిగరేట్లకు బానిసయ్యాడు. ఆ అలవాట్లు మానుకోవాలని తండ్రి మొగిలి మందలించాడు. మనస్తాపానికి గురైన రాజ్‌కుమార్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మొగిలి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన లక్క కొమురయ్య (85) అనే రిటైర్డ్ సింగరేణి కార్మికుడు బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మల్లేశ్ కథనం ప్రకారం.. సింగరేణి కార్మికుడిగా ఉద్యోగవిరమణ పొందిన కొమురయ్య భార్య ఇటీవల మరణించింది. అప్పటి నుంచి మానసిక వేదనకు గురవుతున్న కొమురయ్య ఉరేసుకుని చనిపోయినట్లు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మస్కట్‌లో వలసజీవి..


మాదాసు విజయ్ (ఫైల్)

వేములవాడరూరల్: ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్ బాట పట్టిన యువకుడు అక్కడ కూడా పరిస్థితులు అనుకూలంగా లేక చేసిన అప్పులు తన గదిలోనే రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వేములవాడరూరల్ మండలం అచ్చన్నపల్లిలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. అచ్చన్నపల్లికి మాదాసు విజయ్(27) ఏడాది క్రితం మస్కట్ వెళ్లాడు. అక్కడి కంపెనీలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, అప్పులు పెరగడంతో చేసేదేమి లేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి తండ్రి దేవయ్య, తల్లి మంజుల, అన్న, చెల్లె ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన మడిపల్లి మొగిలయ్య(68) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మొగిలయ్య సొంత పనిమీద ఈ నెల 16న రాత్రి శ్రీరాములపేట గ్రామానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా నరసింహులపల్లి గ్రామానికి చెందిన సమ్మయ్య ట్రాక్టర్‌తో వెనక నుంచి మొగిలయ్యను ఢీ కొట్టాడు. తీవ్ర గాయాలైన మొగిలయ్యను హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఓసీపీలో అసువులుబాశారు

- ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో ప్రమాదం
- వర్షానికి తడిచిన నాలుగు మీటర్ల లోతు మట్టిలో పని
- కార్మికులపై మట్టికూలి ఇద్దరు మృతి.. మరో ఇద్దరికి గాయాలు
- కార్మిక క్షేత్రంలో పండగ పూట విషాదం
- రక్షణ చర్యల్లో వైఫల్యమే కారణం
- అధికారుల తీరుపై కార్మిక సంఘాల ఆగ్రహం


గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి భారీగా చేరుకున్న కార్మికులు


గాయపడిన కార్మికులను అంబులెన్స్‌లో తరలింపు



వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ మృతదేహాలు

గోదావరిఖని: తొలిఏకాదశి పండగ పూట విషాదం నెలకొంది. ఇద్దరు సింగరేణి కార్మికుల ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయి. డ్యూటీకి వెళ్లి వస్తామని చెప్పి ఇంట్లోంచి వెళ్లి ఓసీపీలో అసువులుబాశారు. రక్షణ చర్యల వైఫల్యంతోనే రెండు నిండుప్రాణాలు బలైపోయాయని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైపులైన మరమ్మతుకు సుమారు 4మీటర్ల మేరలోతు కందకాన్ని నిటారుగా తీయడంతోనే ప్రమాదం జరిగిందంటున్నారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు కార్మికులు స్వల్పంగా గాయపడ్డారు.

అసలేం జరిగింది..

సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–2 ప్రాజెక్టులో వర్షాకాలం కావడంతో క్వారీలోని నిలిచిన వరద నీటిని తరలించేందుకు భారీ మోటార్లను ఏర్పాటు చేశారు. సుమారు వంద మీటర్ల దూరం వరకు నిటారుగా పైపులైన్ వేశారు. 68రోడ్‌లెవల్ వద్ద హాలేజీ రోడ్డు కింద పైపులైన్ లీకేజీ ఏర్పడింది. దీన్ని సవరించేందుకు పొక్లెయిన్‌తో హాలేజీ రోడ్డును 4మీటర్లలోతు తవ్వి కందకం తీశారు. నాలుగురోజులుగా మరమ్మతు పనులు సాగుతున్నాయి. బుధవారం రెండోషిఫ్టులో ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు(58), జనరల్ మజ్దూర్ గాదె విద్యాసాగర్(50)తో పాటు సమ్మయ్య, శ్రీనివాస రాజు కందకంలో దిగి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్నారు. సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో ఒక్కసారిగా వీరిపై మట్టికుప్ప కూలింది. వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ మట్టిలో కూరుకుపోయారు. నిల్చున్న సమ్మయ్య, శ్రీనివాస రాజుపై కూడా మట్టిపడటంతో మోకాళ్ల లోతు వరకు కూరుపోయారు. అధికారులు ముందుగా మోకాళ్లలోతులో కూరుకపోయిన వారిని బయటకు తీశారు. పూర్తిగా మట్టిలో కూరుకపోయిన వారిని బయటకు తీసేందుకు సుమారు 25నిమిషాలుపట్టిందని కార్మికులు చెబుతున్నారు. దీంతో శ్వాసఆడక ఇద్దరు మృతిచెందనట్లు డాక్టర్లు ప్రకటించారు. రక్షణ చర్యల్లో వైఫల్యంతోనే ప్రమాదం జరిగిందని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం కురిసిందని, తీసిన మట్టి లూజుగా మారి ప్రమాదం జరిగిందని పేర్కొంటున్నారు. హాలేజీ రోడ్డుపై భారీ డంపర్లు నడుస్తుండటంతో ఈ ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

కారకులపై చర్యలు తీసుకోవాలి

ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు జనక్‌ప్రసాద్, మిర్యాల రాజిరెడ్డి, యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఇక్కడ పనివిధానం సరిగా లేదని ప్రమాదంలో మృతి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్నారు.

డ్యూటీకి వెళ్లొస్తానని..

డ్యూటీకి వెళ్లివస్తామని చెప్పి కానరాని లోకాలు వెళ్లడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఉప్పు వెంకటేశ్వర్లు గతంలో ఇదే గనిలో టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీగా పనిచేసి అందరికి సుపరిచుడు. ఇప్పటివరకు వర్క్‌షాప్‌లో పనిచేయగా ఇటీవలేషిఫ్టుల్లోకి మార్చారు. వెంకటేశ్వర్లు, విద్యాసాగర్‌లు ఇద్దరు సెంటినరీకాలనీలో నివాసముంటున్నారు. ఊహించని ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడంతో వారి కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఏరియా ఆసుపత్రిలో మృతదేహాలను మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సందర్శించారు.వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సీఅండ్‌ఎండీ సీరియస్

ప్రమాదాన్ని సంస్థ సీఅండ్‌ఎండీ బలరాం సీరియస్‌గా తీసుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఫిట్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మజ్దూర్ విద్యాసాగర్ మృతిపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ప్రాణాలు తీస్తున్న అతివేగం

- బంజేరుపల్లి రోడ్డుప్రమాదంతో రెండు కుటుంబాల్లో విషాదం
- మృతులిద్దరిదీ పేద కుటుంబాలే..


బొలేరో ఢీకొట్టడంతో ధ్వంసమైన ట్రాక్టర్ ఇంజిన్ హౌసింగ్


మహేశ్(ఫైల్)


అభిషేక్(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): అతివేగం ప్రాణాలమీదికి వస్తోంది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజేరుపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంతో రెండు కుటుంబా ల్లో విషాదం నింపింది. బొలేరో డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం లోడ్‌తో అతివేగంగా వస్తున్న బొలేరో వాహనం ఎదురుగా వెళ్లే ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో చీకట్ల మహేశ్(30), సోమిడి అభిషేక్(22) మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొలేరో డ్రైవర్ సహా మరో ఇద్దరు పరారయ్యారు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

ఆ కుటుంబాలకు దిక్కెవరు?

మృతుల్లో చీకట్ల మహేశ్‌కు అయిదేళ్ల కిందట కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం రంగపేటకు చెందిన కావ్యతో పెళ్లయింది. వీరికి రెండేళ్ల కూతురు సిరిచందన, నాలుగు నెలల పాప ఉన్నారు. మహేశ్ తల్లిదండ్రులు లక్ష్మి–ఎల్లయ్య కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మహేశ్ తో పాటు ఇద్దరు కూతుళ్లు. ట్రాక్టరు డ్రైవర్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే అతడు మృత్యువాత పడటంతో కుటుంబానికి దిక్కెవ రని భార్య, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు కలిచివేసింది. ఇదే ప్రమాదంలో మృతి చెందిన సోమిడి అభి షేక్ నిరు పేద కుటుంబం. ఇంటర్ వరకు చదివిన అతడు కూలీ పనులకు వెళ్తున్నాడు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు..

కొందరు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని రాత్రివేళ బొలేరోలో తరలిస్తున్నారు. బంజేరుపల్లి గ్రామ శివారులో అది ప్రమాదానికి గురవడంతో పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు వెలుగులోకి వచ్చింది. తెల్లవారు జామున సుమారు రెండున్నర గంటల ప్రాంతంలో ప్రమాదంజరిగింది. బొలేరో బోల్తాపడడంతో అందులోని పీడీఎస్ బియ్యం బస్తాలు రోడ్డుపై పడిపోయాయి.అటుగా వెళ్తున్న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిళ్లు, ఆటోల్లో ఎత్తుకెళ్లారు.

హైనా దాడిలో లేగదూడ మృతి


లేగదూడ కళేబరం

చిగురుమామిడి: హైనాదాడిలో లేగదూడ మృతి చెందిందని మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు దేవునూరి వెంకటేశ్ తెలిపారు. మంగళవారం రాత్రి పశువుల కొట్టంలో ఆవు, లేగదూడను దొడ్లో కట్టేసి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం కొట్టం వద్దకు వెళ్లగా లేగదూడ మృతిచెంది ఉంది. ముక్కు, మెడ భాగంలో దాడిచేయడంతో మృతి చెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఠాణాలో యువకుడి ఆత్మహత్యాయత్నం

చందుర్తి(వేములవాడ): గంజాయి కేసులో నిందితుడిగా అనుమానిస్తున్న అదుపులోకి తీసుకున్న యువకుడు ఠాణాలోనే బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన తోట అఖిల్ వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసు నమోదైంది. అయితే కొన్ని రోజులుగా తప్పించుకు తిరుగుతున్నాడు. అఖిల్ చందుర్తి బస్టాండ్‌లోని ఓ టీస్టాల్‌లో టీ తాగుతున్నాడన్న సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక ఠాణాకు తరలించారు. పోలీసుల అదుపులో ఉన్న సమయంలోనే సదరు యువకుడు కాళ్లు, చేతిపై బ్లేడుతో కాట్లు పెట్టుకున్నాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి వేములవాడ సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం ఏమి లేదని వైద్యులు చెప్పడంతో అదుపులోకి తీసుకున్నట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ వివరించారు.

పోలీసుల వేధింపులు భరించలేకనే..

పోలీసుల వేధింపులు భరించలేకనే బ్లేడుతో కాట్లు పెట్టుకున్నట్లు అఖిల్ వాపోయాడు. ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చి చందుర్తిలోని ఓ కూల్‌డ్రింక్ డీలర్ వద్ద ఆటో నడుపుతున్నట్లు తెలిపాడు. చందుర్తిలో టీ తాగుతున్న సమయంలో ఓ కానిస్టేబుల్, డ్రైవర్ వచ్చి ఠాణాకు పట్టుకెళ్లారని, ఎందుకు తీసుకొచ్చారని అడగ్గా కూర్చోమని బెదించారన్నారు. తనను తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తనకు గంజాయితో ఎలాంటి లేదన్నాడు.

పరారీలో ఉన్న వ్యక్తి రిమాండ్

వేములవాడరూరల్: గంజాయి కేసులో గత ఆరు నెలలుగా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రూరల్ మండల పరిధిలో గత జనవరి 31న గంజాయితో పట్టుబడ్డ చేపూరి సాయికుమార్, చిక్కుడు ప్రేమ్‌కుమార్, బాస రాజ్‌కుమార్, కీసరి రమేశ్‌లను విచారించగా ఆమీర్, కాల్వ వెంకటేశ్, పండుగ అభి, రవి వద్ద గంజాయి కొనుగోలు చేశామని తెలిపారు. ఆ నలుగురిని విచారించగా వారికి చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన తోట అఖిల్ గంజాయి సప్లయ్ చేసేవాడని తెలిపారు. గతంలో అందరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న అఖిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రిలే నిరాహారదీక్షకు పోలీసుల అనుమతి నిరాకరణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని నేరెళ్ల గ్రామంలో నేరెళ్ల బాధితులు చేపట్టనున్న రిలే నిరాహారదీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని నేరెళ్ల బాధితుడు కోల హరీష్ బుధవారం తెలిపారు. బుధవారం నుంచి ప్రారంభించాలిస్న రిలే నిరాహార దీక్షలను మొహర్రం, తొలిఏకాదశి సందర్భంగా గురువారానికి వాయిదా వేసినట్లు తెలిపారు. అయితే పోలీసులు అనుమతి నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. హైకోర్టు అనుమతితో త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

గుండెపోటుతో మాజీ ఉప సర్పంచ్ మృతి

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలకు చెందిన మాజీ ఉపసర్పంచ్ బద్దం మహిపాల్‌రెడ్డి (38) గుండెపోటుతో బుధవారం మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మహిపాల్‌రెడ్డి కాలికి గాయం కావడంతో కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అదే సమయంలో గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పొలంలో పడి వ్యక్తి మృతి


గంగాధర్ (ఫైల్)

మల్యాల(చొప్పదండి): పొలంలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ముత్యంపేటలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్యాల గంగాధర్(40) బుధవారం కొంత మందితో కలిసి విందుభోజనానికి వెళ్లాడు. బహిర్భూమికని వెళ్లి నాటు వేసేందుకు సిద్ధం చేసిన పొలంలో పడ్డాడు. శ్వాస ఆడక అక్కడికక్కడే మృతిచెందాడు. సమీప రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నరేశ్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అమ్మా.. ఎంత పనిచేశావు..!

- క్షణికావేశంలో తల్లి ఆత్మహత్య
- ఏమైందో తెలియని వయసులో పిల్లలు
- రెండు కుటుంబాల్లో తీరని శోకం
- కన్నీరు పెట్టించిన చిన్నారుల తీరు


శ్రావణి (ఫైల్)

మేడిపల్లి: ‘అమ్మా.. మమ్మల్ని ముద్దుగా పెంచావు. ఎంత అల్లరి చేసినా ఓపికగా భరించావు.. అందరితో ఆడుకుంటుంటే మురిసిపోయావు. మేమే నీ లోకం.. మేమే నీ సర్వస్వం అన్నట్లు మెదిలావు.. అంతలోనే మమ్మల్ని అనాథలను చేసి వెళ్లిపోయావా అమ్మా.. ఇక మాకు దిక్కెవరు.. మమ్మల్ని ఎవరు లాలిస్తారు.. ఎవరు బుజ్జగించి బువ్వ తినిపిస్తారు అమ్మా.. అనే రీతిలో ఆ చిన్నారులు తల్లి మృతదేహం వద్ద కనిపించిన తీరు కంటతడి పెట్టించింది. క్షణికావేశంలో ఆ తల్లి తీసుకున్న నిర్ణయం అటు పుట్టింట్లో.. ఇటు మెట్టింట్లో తీరని శోకాన్ని మిగిల్చింది. ఈ విషాధ ఘటన భీమారం మండలంలోని కమ్మరిపేటలో చోటుచేసుకుంది. కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామానికి చెందిన పాక లక్ష్మి, రాజం కూతురు శ్రావణిని కమ్మరిపేట గ్రామానికి చెందిన తిపిరి నరేశ్‌కిచ్చి ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు శ్రాహన్స్(4), రుద్రాన్స్ (ఏడాది) ఉన్నారు. నరేశ్ తనకున్న పొలంలో వ్యవసాయం చేస్తున్నాడు. శ్రావణి బీడీలు చుడుతోంది. ఉన్నంతలో హాయిగా ఉంటున్నారు. ఈ క్రమంలో శ్రాహన్స్‌కు ఐదు రోజులుగా జ్వరం వస్తోంది. అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లాలని నరేశ్ శ్రావణికి చెబుతున్నాడు. తానే తీసుకెళ్లాలంటే ఎలా అని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రావణి మంగళవారం ఇంట్లోకి వెళ్లి క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను జగిత్యాల ఆస్పత్రికి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ‘ఎంత పనిచేశావు బిడ్డా.. నీ పిల్లలు పసిమొగ్గలని గుర్తుకురాలేదా.. ఆ యముడే మదిలో నుంచి జ్ఞాపకాలు తీసేసాడా.. అంటూ గుండెలవిసేలా రోదించారు. విగతజీవిగా మారిన భార్య మృతదేహాన్ని చూస్తూ భర్త నరేశ్.. అమ్మకు ఏమైంది నాన్న అంటూ నాలుగేళ్ల కొడుకు.. ఏం జరుగుతుందో తెలియక బోసిపోయిన ముఖంతో ఏడాది కుమారుడు.. మీ అమ్మ ఇకరాదు బిడ్డా అని ఎలా చెప్పాలో తెలియక బరువెక్కిన హృదయంతో దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు శ్రావణి తల్లిదండ్రులు. అప్పటి వరకు అందరితో కలివిడిగా ఉన్న శ్రావణి క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం తన ఇద్దరు పిల్లలతోపాటు కుటుంబ సభ్యులకు కడుపుకోతను మిగిల్చింది. పెద్ద కుమారుడితో శ్రావణికి తలకొరివి పెట్టించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

రాజన్న సన్నిధిలో సంగీత విభావరి


రాజన్న సన్నిధిలో సంగీత విభావరిలో స్థానిక కళాకారులు

వేములవాడ: రాజన్న సన్నిధిలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని ఆలయ అధికారులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రంతా భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ తిరిగి ఉదయం వరకు అఖండ భజన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కళాకారులతోపాటు ధర్మపురి కళాకారుల శాస్త్రీయ సంగీతం, మంటప హనుమాన్ దేవస్థానికి చెందిన కళాకారుల భజన, సిరిసిల్ల భజన మండలి, హరికథాగానం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కళాకారులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో కొప్పుల వినోద్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అభినందించారు.

ఆర్థికసాయం అందజేత


చొప్పదండి: ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి అంజయ్య జూన్ 28న సౌదీ అరేబియాలో మృతి చెందగా స్వగ్రామానికి మృతదేహం తీసుకురావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. జీవనోపాధికి గల్ఫ్ వెళ్లిన అంజయ్య గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం రాత్రి అంజయ్య మృతదేహం స్వగ్రామానికి రానుండగా మేడిపల్లి రూపాదేవి ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.ఐదు వేలు కాంగ్రెస్ నాయకుల ద్వారా అందించారు. కార్యక్రమంలో మునిగాల చందు గౌడ్, నరేశ్‌గౌడ్, క్లోం దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తల్వార్‌తో వీడియోలు.. వ్యక్తి రిమాండ్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక సంజీవయ్యనగర్‌కు చెందిన తోటిచెర్ల సాయివర్ధన్ కొన్ని నెలలుగా తల్వార్, పెద్దకత్తితో విన్యాసాలు చేస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. మారణాయుధాలతో తీసిన వీడియోలను ఇన్‌స్టా గామ్‌లో పోస్టు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. ఈవిషయం పోలీసుల దృష్టికొచ్చి ంది. ప్రజల శాంతియుత జీవనానికి భంగం కలిగించేలా రూపొందించిన వీడియోలు చిత్రీకరిస్తున్న సాయివర్ధన్‌పై ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేశారు. బుధవారం అరెస్టు చేసి తల్వార్, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రి మాండ్‌కు తరలించినట్లు సిరిసిల్లపట్టణ సీఐ కృష్ణ తె లిపారు. ఆన్‌లైన్ రీల్స్, వీడియోల పేరుతో చట్ట వ్య తిరేక చర్యలకు పాల్పడిన వారికి నూతన చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్కెట్‌లోకి రూ.20 కాయిన్


సిరిసిల్ల మార్కెట్‌లోకి వచ్చిన రూ.20 కాయిన్

సిరిసిల్ల: మార్కెట్‌లోకి రూ.20 కాయిన్ వచ్చింది. ఇప్పటికే చిల్లర కొరత మార్కెట్‌ను వేధిస్తోంది. రూ.10 కాయిన్ చెల్లదంటూ తప్పుడు ప్రచారంతో చెలామణి నిలిచిపోయింది. రూ.10నోట్ల కొరత తీవ్రంగా ఏర్పడింది. తాజాగా రూ.20 నాణెం సిరిసిల్ల మార్కెట్‌లోకి వచ్చింది. సామాజిక కార్యకర్త వేముల మార్కెండేయులు వద్దకు రూ.20 నాణెం బుధవారం చేరింది. వీటి రాకతో మార్కెట్‌లో కొంతైనా చిల్లర సమస్య తీరుతుంది. మరోవైపు రూ.10 నాణేలు చెల్లవనే తప్పుడు ప్రచారంపై బ్యాంకర్లు, ఎల్‌డీఎం అధికారులు బహిరంగ ప్రకటన చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి


నాగేశ్వర్‌గౌడ్ (ఫైల్)

జమ్మికుంట: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన మాచర్ల నాగేశ్వర్‌గౌడ్(63) బుధవారం తాటిచెట్టు ఎక్కుతుండగా కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. నాగేశ్వర్‌గౌడ్‌కు భార్య స్వరూప, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు.

మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నాగేశ్వర్‌గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేసియా అందించాలని మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్‌కుమార్, గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు కొండపాక రమేశ్, నేరేళ్ల సదానందం, ఒల్లాల చిరంజీవి కోరారు.